క్లుప్తంగా

స్వామిత్వ సర్వేతో ప్రజల ఆస్తులకు భద్రత



చంద్రేడులో స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి వెంకట్, సచివాలయ సిబ్బంది

రంగంపేట: స్వామిత్వ సర్వేతో గ్రామాల్లోని ప్రజల వ్యక్తిగత ఆస్తుల వివరాలతో పాటు ప్రభుత్వ రంగ ఆస్తులను సరిహద్దులతో సహా భద్రత కలుగుతుందని పంచాయతీ కార్యదర్శి బోనగిరి వెంకన్నబాబు తెలిపారు. మండల పరిధిలోని చంద్రేడులో శనివారం స్వామిత్వ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటితో పాటు రోడ్లు, చెరువులు, ఆలయాలు, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్లు, పంచాయతీ ఆస్తులు వంటివి సర్వే చేస్తున్నామన్నారు. సరైన దస్తావేజులు లేని కారణంగా తమ సొంత ఇళ్లపై బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు జరగని వారికి స్వామిత్వ కార్డుల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మౌనిక, సోషల్ వెల్ఫేర్ అధికారి పూర్ణచంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనకు సత్యసాయి దీక్షలు చేపట్టాలి

రంగంపేట: నిరంతరం ఆధ్యాత్మిక చింతనకు ఆరోగ్యానికి సత్యసాయి దీక్షలు చేపట్టాలని సత్య సాయి సేవా సంస్థల జిల్లా సేవాదళ్ సహాయ సమన్వయకర్త తిక్కిశెట్టి గోవిందరాజు సూచించారు. రంగంపేట మండలం, ఈలకొలనులో సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో శనివారం ఉదయం భగవాన్ సత్య సాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వంద రోజుల దీక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.సుమారు వందమంది భక్తులు ఈ దీక్ష చేపట్టారని స్థానిక సేవా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు చెప్పారు. పాత వీరంపాలెం భజన మండలి కన్వీనర్ నాగులపల్లి సూర్య భాస్కరరావు, సత్యవాణి, కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకటఅమర్నాథ్, చిరట్ల రంగమాంబ, పంట సాంబశివరావు, భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో సత్య సాయి శతవర్ష జయంతి దీక్ష కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

కంబాలచెరువు: ఎస్పీ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఏఎస్పీ ఎల్.చెంచిరెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవికుమార్, ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, ఆర్ఐ సంజీవ్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుళ్లపల్లికి 'వేద ధర్మప్రచారమణి' బిరుదు



గుళ్లపల్లిని సత్కరిస్తున్న విశ్వనాథ శాస్త్రి తదితరులు

సీటీఆర్ఐ: వేద వేదాంగములు, వేదార్థం, సలక్షణ ఘనాంతములో విశేష కృషి చేసిన గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠికి సన్మానం చేయడమంటే వేద విద్యను గౌరవించుకోవడమేనని కంచి కామకోటి పీఠం ప్రతినిధి చల్లా విశ్వనాథ శాస్త్రి అన్నారు. శనివారం త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ఆడిటోరియంలో దత్తాత్రేయ వేద విద్యా గురుకులం గౌరవాధ్యక్షుడు, ప్రధాన ఆచార్యుడు గుళ్లపల్లి సీతారామ చంద్ర ఘనపాఠిని 'వేద ధర్మ ప్రచారమణి' బిరుదుతో కంచి కామకోటి పీఠం తరపున సత్కరించారు. పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి సత్యచంద్రశేఖర సరస్వతీ స్వాములు ఆశీర్వచనాలు ఆయన ఈ సందర్భంగా వినిపించారు. సదాచార పరిరక్షణలో, వేద విద్యాప్రచారంలో గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని వారన్నారు. సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, పలువురు వేద పండితులు పాల్గొన్నారు.

లాభాల బాట

- పొలంలో కాలిబాటలతో ఎంతో మేలు
- పంట దిగుబడి పెరిగే అవకాశం
- వరి సాగులో ఖర్చు ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు

పెదపూడి: వరిసాగులో కాలిబాటలతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా పైరుకు చీడపీడల సమస్య ఉండదు. పెట్టుబడి వ్యయం తగ్గి దిగుబడి పెరుగుతుంది. అయితే చాలా మంది రైతులు కాలిబాటలు వేయడానికి తటపటాయిస్తుంటారు. దీనిని అనవసర వ్యయంగా భావిస్తారు. ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.1500 ఖర్చవుతుంది. అయితే దిగుబడిలో సుమారు నాలుగు బస్తాల వరకు పెరుగుదల కనిపిస్తుంది. రైతులు తప్పనిసరిగా వరి చేలల్లో కాలిబాటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ చెబుతున్నారు.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒకవైపు నుంచి రెండో వైపు వరకూ సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరి నాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న చోట నాటుకోవాలి. చేను గట్టు పక్క నుంచి అడుగు దూరంలో కాలిబాట వేసి అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక బాట వేయాలి. కొందరు రైతులు ప్రతి 6 నుంచి 7 మీటర్లకు ఒక కాలిబాట వేస్తుంటారు. దీని వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. ముందు నాట్లు వేసిన రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్కు చేసిన చోట ఉన్న మొక్కలను తీసి వేసి కాలిబాట వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో అయితే పైరు ఎదుగుతున్న సమయంలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 20 సెంటీమీటర్ల వెడల్పులో వరి నాట్లు తొలగించి కాలిబాట వేసుకోవచ్చు.

ప్రయోజనాలు

- కాలిబాటతో పైరు మొదళ్ల వరకూ వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతుంది. పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంత వరకూ తగ్గుతుంది.
- కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది.
- తెగుళ్ల గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు కాలిబాటలు ఉపయోగపడతాయి. తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రతి కూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంట చేల్లో మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థంగా జరిగి దిగుబడి పెరుగుతుంది.
- పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ తీసుకునే వీలు కలుగుతుంది.



పెదపూడి గ్రామంలో కాలిబాటలు వేసిన పొలం

49,350 ఎకరాల్లో వరి సాగు

నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 12 వేల ఎకరాలు, బిక్కవోలులో 13 వేలు, పెదపూడిలో 18,150, రంగంపేట మండలంలో 6,200 ఎకరాల్లో మొత్తం ఈ సీజన్‌లో 49,350 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 90 శాతం నాట్లు పూర్తయ్యాయి.

తెగుళ్లను సులువుగా గుర్తించవచ్చు



ప్రతి పంటలో వరిలో కాలిబాట వేసి సాగు చేస్తున్నాను. దీని వల్ల పైరుకు పొలం మధ్యలో తెగుళ్లు, చీడపీడలు ఆశించినా గుర్తించే వీలుంటుంది. పురుగు మందులు, ఎరువులు వేయడానికి ఉపయోగంగా ఉంటుంది. ఈ సార్వాలో కూడా పొలంలో కాలిబాటలు వేసుకున్నాను.

– తోటకూర సత్యనారాయణ, రైతు, కరకుదురు

కాలిబాటలు వేసుకోవాలి



కాలిబాటల వేయడంతో దిగుబడి ఏ మాత్రం తగ్గదు. పైగా రెండు, మూడు బస్తాలు అదనంగా వస్తుంది. కాలిబాటల వల్ల సస్యరక్షణ చర్యలు తీసుకోవడం సులభమవుతుంది. వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు పొలంలో కాలిబాటలు వేసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఎస్.సత్యప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి, పెదపూడి మండలం

విద్యార్థిని చదువుకు ఆర్థిక సహాయం అందజేత



కొంకుదురులో గణేశ్వరికి ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు, ప్రజాప్రతినిధులు

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి కురందాసు గణేశ్వరికి హైదరాబాద్‌కు చెందిన మాదిరెడ్డి జగన్నాథరావు నాయుడు మెమోరియల్ ట్రస్ట్ ఆర్థిక సహాయాన్ని అందించారు.శనివారం స్థానిక ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ గణేశ్వరి చదువుకు 2022 నుంచి ఏడాదికి రూ.25వేల చొప్పున సాయం అందిస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సహాయాన్ని సర్పంచి సత్తి వీరమణి, సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చింతాశ్రీనివాసరెడ్డి, కొమరిపాలెం డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాల రెడ్డి సమక్షంలో అందించారు.పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, టీచర్ శిరీషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



చిడిపి అక్షయ

సీతానగరం: చినకొండేపూడికి చెందిన పదవ తరగతి విద్యార్థిని చిడిపి అక్షయ రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి శనివారం తెలిపారు. చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి చదువుతున్న అక్షయ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ సెలెక్షన్‌లో గొల్లల మామిడాడలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చి వచ్చే నెల 12,13,14 తేదీల్లో అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అక్షయను అభినందించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు



బలభద్రపురంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం, కృష్ణాష్టమి, శనివారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో స్వామి దర్శించుకున్నారు. వేకువజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, సుప్రభాతం సేవ తదితర పూజలు నిర్వహించారు. భక్తులు ముందుగా వరాహస్వామి దర్శనం అనంతరం గోవింద నామస్మరణతో ముందుకు సాగారు. అనంతరం ఆలయం కమిటీ సభ్యులు భక్తులకు అన్నసమారధన ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు నల్లమిల్లి రామచంద్రారెడ్డి (రాము) ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొంకుదురు, పందలపాక, బిక్కవోలు, కొమరిపాలెం గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

వివాదాస్పద చెరువులో చేపల వేట

బిక్కవోలు: కోర్టు పరిధిలో ఉన్న బలభద్రపురంలోని శివారున కానేడు గ్రామంలోని చెరువులో చేపలు పట్టుకున్న 18 మందిపై కేసు నమోదు చేయడంతోపాటు మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 1982లో గ్రామం పరిధిలోని 66 ఎకరాల భూమిని 55 మంది పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆ భూమిలో పంటలు సాగు చేయకుండా మైనింగ్ చేస్తున్నారని 2016లో ఆరోపణలు రావటంతో మొత్తం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అనంతరం 34 ఎకరాలు ఏపీ కార్పొరేషన్, 20 ఎకరాల ప్రభుత్వ నివేశ స్థలాలు, 5 ఎకరాలు సివిల్ సప్లయి శాఖకు గిడ్డంగుల నిర్మాణానికి కేటాయించారు. మిగిలిన సర్వే నంబర్ 123–1ఎ/1లోని 4.32 ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలు చేయడంతో గోతులు ఏర్పడి చెరువుగా మారాయి. చెరువులున్న భూమి తనదంటూ 2024లో దార్వంపూడి సూరయ్యమ్మ ఫిర్యాదు చేయడంతో కోర్టులో కేసు నడుస్తోంది. ప్రభుత్వం అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ఆ భూమి జోలికి ఎవరూ వెళ్లవద్దని ప్రకటించడంతో ఏప్రిల్ 22న కోర్టు నుంచి స్టే వచ్చింది. ఈ చెరువులో శనివారం కొందరు చేపలు పడుతున్నారని వీఆర్వోకు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లిన అధికారులు ఆటో, రెండు వ్యాన్లతోపాటు సుమారు 18 మంది చేపలు పడుతున్నారని గుర్తించి వారిపై పోలీసులు ఫిర్యాదు చేశారు. సింగిడి దుర్గప్రసాద్ తదితరులు వీఆర్వో మాచవరపు శ్రీనివాస్, అధికారులతో మాట్లాడుతూ చెరువులోని చేపలను పట్టుకోవచ్చని దార్వంపూడి సూరయ్యమ్మ చెప్పడంతో వచ్చామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న చేప పిల్లలను చెరువులో వదలివేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



బలభద్రపురం చెరువులో అక్రమంగా చేపల వేట

వర్షం కురిస్తే.. రాకపోకలు బంద్

కోరుకొండ: వర్షం కురిస్తే 516ఈ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోవాల్సిందే. కొద్దిపాటి వర్షానికే కోరుకొండ మండలం గాడాల పొన్నాలమ్మ ఆలయం వద్దకు ముంపు నీరు చేరి చెరువును తలపిస్తోంది.

కూటమి ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. శనివారం ఉదయం నుంచి వర్షం నీరు జాతీయరహదారిపైకి చేరడంతో తెలంగాణలోని భద్రాచలం, ఛత్తీష్‌గఢ్ రాష్ట్రంలోని జగ్‌దల్‌పూర్, అల్లూరి సీతారామ రాజు జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలకు బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రభుత్వాధికారులు త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక కుమారి థియేటర్ వద్ద శనివారం ఓ వ్యక్తి మృతదేహాన్ని టుటౌన్ పోలీసులు కనుగొన్నారు. రైల్వే వంతెన సమీపంలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడు వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. సమాచారం తెలిసిన వారు టుటౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

వామ్మో.. వయ్యారి భామ

- పార్థీనియం కలుపు మొక్కతో రోగాలు వ్యాప్తి
- కేవీకేలో అవగాహన వారోత్సవాలు ప్రారంభం

రాజానగరం: మండలంలోని కలవచర్ల, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ప్రపంచంలో మొండి జాతికి చెందిన 10 రకాల కలుపు మొక్కలలో ఒకటైన పార్థీనియం (వయ్యారి భామ)పై అవగాహన వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో ఈ మొక్క పూర్తిగా నిర్మూలించే దిశగా దేశవ్యాప్తంగా ఏటా ఆగస్టు 16 నుంచి 22 వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వ్యయారి భామ మొక్క వ్యాప్తి, దానివలన కలిగే రోగాలపై కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, కేవీకేని సందర్శించిన మేరీ స్టెల్లా వ్యవసాయ కళాశాల (విజయవాడ) విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అమెరికా నుంచి భారత్‌లోకి..

పార్థీనియం కలుపు మొక్క అమెరికా నుంచి సుమారు 70 ఏళ్ల క్రితం గోధుమ విత్తనాల దిగుమతి ద్వారా మన దేశంలో ప్రవేశించింది. దీనిని ఇక్కడ వయ్యారి భామ, మాచర్ల కంప, ముక్కు పుడక మొక్క అని పిలుస్తుంటారు. ఉత్తర భారతదేశంలో క్యారెట్ గ్రాస్, కాంగ్రెస్ గ్రాస్, నక్షత్ర కలుపు మొక్క అని పిలుస్తారు. ఈ మొక్క సుమారు రెండుమీటర్లు ఎత్తు వరకు ఎదుగుతుంది. శాఖోపశాఖలుగా కొమ్మలతో ఏపుగా పెరుగుతుంది. ఇది మొలకెత్తిన నాలుగు నుంచి ఆరు వారాలలోగానే పూత దశకు వస్తుంది. ఒక్కో మొక్క 10 వేల నుంచి 25 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. వీటి విత్తనాల పైభాగం జుత్తు కలిగి ఉండటం వలన గాలి, నీరు, పశువులు, మనుషులు, వ్యవసాయ పనిముట్ల ద్వారా సులువుగా వ్యాపిస్తాయి. చూడటానికి అందంగా కనిపించే ఈ మొక్క ఎక్కువగా పంట పొలాలు, బంజరు భూములు, అటవీ ప్రాంతాలు, రహదారుల పక్కన, పార్కులు, రైల్వే లైన్ వెంబడి విస్తతంగా ఎదుగుతుంది.



విద్యార్థులకు వయ్యారి భామ మొక్కపై అవగాహన కలిగిస్తున్న కేవీకే ప్రధానాధికారి డాక్టర్ నాయుడు

వయ్యారి భామతో దుష్ప్రభావాలు అధికం

ఈ మొక్కలోని అన్ని భాగాల్లో (కాండం, ఆకులు, కొమ్మల పై నూగు, పుప్పొడి) పార్థీనిస్ అనే విష పదార్థం ఉంటుంది. ఈ విషం వలన మానవాళికి, పశువులకు వివిధ రకాల జబ్బులు సంభవిస్తాయి. ఈ మొక్కల పుప్పొడి వలన మనుషుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధులు (ఆస్తమా), చర్మ వ్యాధులు, విష జ్వరాలు, ఎగ్జిమా, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయి. పుప్పొడి కలిసిన గాలిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడటం, కనురెప్పల వాపు సంభవిస్తుంది. పశువులకు కూడా ఊపిరితిత్తుల వ్యాధులు, జ్వరాలు, చర్మ వ్యాధులు సోకుతాయి. పాడి పశువులు ఈ మొక్కలను ఆహారంగా తీసుకున్నప్పుడు చర్మ సంబంధమైన వ్యాధులు కలగడమే కాకుండా పాల ఉత్పత్తి తగ్గి, పశువులు బరువును కోల్పోతాయి.

పంటలకు, ఇతర మొక్కలకు నష్టం

పార్థీనియం మొక్క కారణంగా వ్యవసాయంలో 40 శాతం వరకు పంట నష్టం వాటిల్లుతుంది. ఇవి ఒక రకమైన రసాయనాన్ని వేర్ల ద్వారా స్రవించి ఇతర మొక్కలను మొలకెత్తకుండా నిరోధిస్తాయి. పశ్చిక మైదానాల్లో గడ్డి పెరగకుండా చేస్తుంది. ఈ కారణంగా పశుగ్రాసం కొరతకు కారణమవుతాయి. పంటలను ఎదగకుండా చేయడంతో దిగుబడులు గణనీయంగా పడిపోతాయి. ఈ మొక్కల పుప్పొడి వలన టమాటా, వంగ, చిక్కుడు వంటి కూరగాయల మొక్కలు, పాదులు పూత రాలిపోయి, కాయ ఏర్పడకుండా నిరోధిస్తుంది. వివిధ పంటలకు సోకే పిండి నల్లికి ఈ పార్థీనియం మొక్కలు నివాస స్థలాలుగా ఉపయోగపడతాయి.

నివారణ చర్యలు

ఈ మొక్కల ఉధృతి ఎక్కుగా ఉన్న పొలాల్లో పంట మార్పిడి సాగు ద్వారా కలుపును నివారించవచ్చు. పార్థీనియం మొక్కలను వేర్లతో పాటు తొలగించి తగలబెట్టాలి. జై గో గ్రామా, బై కొలరేటా అనే కీటకాలు ఈ మొక్కల ఆకుల, కాండాన్ని తింటాయి వాటి ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పైరు సాగు చేయని పొలాల్లో ఉప్పు ద్రావణాన్ని 15 లేదా 20 శాతం (లీటరు నీటిని 150 లేదా 200 గ్రా.) పూతకు రాకముందే పిచికారీ చేయాలి. వేసవిలో ఎకరాకు గ్లైఫోసేట్ ఒకటి లేదా 1.5 లీ. పూత దశకు రాకముందే కలుపు మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా కూడా వయ్యారి భామ ఉధృతిని తగ్గించవచ్చు.

వేడుకగా శ్రీకృష్ణ జన్మాష్టమి



పందలపాకలో ఉట్టి కొడుతున్న బాలుడు

రాజానగరం: నియోజకవర్గంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని ఆలయాల వద్ద యాదవులు కృష్ణభగవానుని పుట్టినరోజును సంబరాలుగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైష్ణవాలయాలలో పలుచోట్ల ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఉట్టి కొట్టారు.స్థానిక అగ్రహారంలోని రామాలయం వద్ద యాదవ సమాజానికి చెందిన యువకులు శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు చేసి, ఉట్టి కొట్టారు. పలు గ్రామాల్లోను శ్రీకృష్ణాష్టమి సంబరాలు ఘనంగా నిర్వహించారు.



సంపరలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు, పెద్దలు, చిన్నారులు

సీతానగరం మండలంలో..

సీతానగరం: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీసత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. రఘుదేవపురం, బొబ్బిల్లంక, మునికూడలి, సింగవరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటవరం శ్రీకృష్ణుని ఆశ్రమంలో, రాపాక పరిధిలోని శ్రీరామనగరం శ్రీచిట్టిబాబాజీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో వేడుకలు

బిక్కవోలు: శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రజలకు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బాలకృష్ణుడు, రాధా, గోపిక వేషధారణల్లో చిన్నారులు అందరినీ అలరించారు. చిన్నారులు ఉదయం నుంచి ఉట్టి కొట్టేందుకు ఏర్పాట్లు చేశారు. పందలపాక శ్రీకట్లమ్మ తల్లి ఆలయం వద్ద ఉట్టి కొట్టారు. అనంతరం వెలమపేట రామాలయం వద్ద శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. కొమరిపాలెంలోని చిన్నారుల ఊట్టి కొట్టారు. బిక్కవోలు, బలభద్రపురం, ఊలపల్లి, కొంకుదురు, పందలపాక, ఇలపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



దత్త పీఠంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

రంగంపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం చిన్నారులకు కృష్ణుడు, గోపిక వేషధారణతో ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పెదపూడి మండలంలో..

పెదపూడి: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఏపీత్రయం, జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, సంపర, కాండ్రేగుల, రామేశ్వరం తదితర గ్రామాల్లో కృష్ణుడి ఆలయాల వద్ద ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. సంపరలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు.



రాజానగరంలోని సాయిబాబా ఆలయం వద్ద ఉట్టి ఉత్సవంలో యాదవులు

సమాజ శ్రేయస్సు కోసం శ్రీకృష్ణాష్టమి వేడుకలు

రంగంపేట: సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ, ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా, ఆధ్యాత్మకంగా, దివ్యమైన జీవితాన్ని గడపాలనే లక్ష్యంతో ప్రతి ఏటా శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని పాత వీరంపాలెం కుసుమహరనాథ ఆశ్రమ పీఠాధిపతి కొర్ల ఫణికుమార్ చెప్పారు. శనివారం శ్రీకష్ణ జన్మాష్టమి సందర్భంగా రంగంపేట మండలం, పాత వీరంపాలెంలో కుసుమహర్నాథ ఆశ్రమంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. లక్ష పత్రి పూజ, శ్రీ కష్ణభగవాన్ చిత్రపటాన్ని రథోత్సవం, సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. సత్యసాయి భజన మండలి కన్వీనర్ నాగులపల్లి సూర్యభాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తులకు అన్నదానం చేశారు. వడిశలేరు, పెదరాయవరం, రంగంపేట, కోటపాడు తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



రాధాకృష్ణ వేషధారణలో ఉట్టికొడుతున్న చిన్నారులు

బాల రాజేశ్వరీ పీఠంలో..

అనపర్తి: స్థానిక సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శ్రీబాల రాజేశ్వరి పీఠంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి సురేష్ శర్మ కృష్ణాష్టమి ప్రాముఖ్యతను వివరించారు. రామమోహనరావు దంపతులు, దుర్గామహాలక్ష్మి, రెడ్డి సతీష్, నల్లమిల్లి వీర్రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔదంబర దత్త పీఠంలో..

అనపర్తి: స్థానిక ఆర్కే ఎగ్ గోడౌన్స్ సమీపంలో ఔదంబర దత్త పీఠంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి మల్లిడి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అనఘాష్టమి వ్రతం, అనఘా దత్త రక్షా మంత్ర హోమం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి శ్రీదత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు.